

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్

**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

# వీడు మగాడ్రా బుజ్జీ... !

– తనికెళ్ళ భరణి

ఒక అద్భుతం ఆవిష్కరించబడింది!!
ఒక Adventure Film చూస్తున్నట్టు...
అప్పట్లో 'మెగాస్టార్' సినిమా చూస్తోంటే కలిగే ఉద్వేగం... ఉత్సాహం...
ఇది రాసింది యండమూరి వీరేంద్రనాథ్. అతను మనకి బాగా తెలిసిన విషయాన్ని కూడా... కొత్తగా వింటున్నట్టూ... చూస్తున్నట్టూ... చెప్పగల సమర్థుడు!.
కానీ అతను రాయడానికి కూడా... గట్టి వస్తువు దొరకాలి కదా.
నాకు తెలిసి ఇది అతడు రాసిన రెండో జీవిత చరిత్ర.
మొదటిది... 'ఇడ్లీ వడ ఆకాశం' కామత్‌ది. రెండోది... చిరంజీవిది..!
నన్ను అబ్బురపరిచిన జీవిత చరిత్రల్లో

***చార్లీచాప్లీన్... మర్లిన్ మన్రో...***
***శ్రీపాదవారి అనుభవాలు జ్ఞాపకాలూనూ***
***తిరుమల రామచంద్ర గారి హంపీ నుంచి హరప్పా దాకా***
***దాశరథి రంగాచార్య గారి నా జీవనయానం..***

ఆ స్థాయిలో ఉన్నాయ్ ఈ కథలో కథానాయకుడి కష్టాలు..!
ఎవరికైనా చచ్చిపోదామనిపిస్తుంది..!
ఆ స్థితిలోంచి బైట పడ్డవాడే 'చిరంజీవి' అవుతాడు..
ఇంగ్లీషు..! ఇది చాలామందిని భయపెట్టే 'శ్వేత భూతం'.
ఆరంభంలో నిర్లక్ష్యం చేసామా... ఆ తరువాత జీవితాంతం పట్టి పీడిస్తుంది!!
ఇంగ్లీషు కొంచెమే వచ్చిన ఓ పెద్ద డైరెక్టర్ ఉండేవాడు. ఎవరన్నా బాంబే హీరోయిన్ వచ్చిందంటే చాలు వణికిపోయేవాడు. ఇంగ్లీష్‌లో మాట్లాడాల్సి వొస్తుందని...! బిజీగా ఉన్నట్టు నటిస్తూ, అసిస్టెంట్ డైరెక్టర్ని పంపేవాడు. రోజంతా బెంగగా ఉండేవాడు. అంచేత సీన్లమీద దృష్టి పెట్టలేక పోయేవాడు!!..

...ఇవాళ మీకిష్టం ఉన్నా లేకపోయినా... దానితో కాపురం చెయ్యక తప్పని 'దొరసాని' ఇంగ్లీషు ! ఆవిడకి దాస్యం చేసే బదులు... అధికారం చెలాయించొచ్చన్నది చిరంజీవి గారి 'మేధ' స్సులోంచి పుట్టిన ఆలోచన..
తెలుగు మన మాతృభాష ! దాన్ని ఆస్వాదించండి !
ఇంగ్లీషు... బతుకు భాష ! దాని మీద  సాధికారత సంపాదించండి..!

ఒక సామాన్యుదు.. మాన్యుడై... ధన్యుడైన కథనం ఇది..!
చాలా లైన్లు కొటేషన్లలాగా ఉన్నాయ్..!
ఈ జీవితగాథ చదివితే.. మనకీ ధైర్యం వొస్తుంది..!
ఏదైనా సాధించాలన్న కోరిక కలుగుతుంది..!
చెప్పొద్దూ... నాకైతే... ఇంగ్లీషు మరికాస్త బాగా నేర్చుకుంటకు మేధలో చేరితే బావుణ్ణెమో అనిపించింది..!
బలహీనులకి ఇది సంజీవిని.
ఇంగ్లీష్... నేర్చుకునేవాళ్ళకి టానిక్కు..
చిరంజీవి... చిరంజీవ!!

ఇష్టంగా

(20-12-2015)

# ఉపోద్ఘాతం

ఆకలేసినప్పుడు కడుపులో ఎలుకలు పరుగెత్తుతాయి అంటారు.

ఈ సామెత సృష్టించినవారికి క్షుద్బాధ గురించి బహుశా సరిగ్గా తెలిసి ఉండకపోవచ్చు.

ఆకలితో ప్రాణం గిలగిలా కొట్టుకుంటున్నప్పుడు ఎలుకలు కాదు.

పాములు పరుగెడతాయి.

ప్రేవుల్ని కొండచిలువలు చుట్టుకుని మెలి పెడుతున్నట్టు 'బాధ' నడుముకి వేసిన ఉరితాడవుతుంది.

ఇప్పుడు నేనా స్థితిలోనే ఉన్నాను.

భోజనం కాదు కదా, కడుపులోకి ఏదైనా వెళ్ళి ఎన్ని రోజులైందో నాకే గుర్తు లేదు.

కాకినాడలో  చిన్న గది. ఆ గదిలో నేను. నేను ఒక్కణ్ణే. నాతో  పాటూ ఆకలి.

సుబ్బయ్య హొటల్‌లో అరువు పరాకాష్టకు చేరుకుంది.

ఊర్లో ఇక పైసా అప్పు పుట్టదు.

నన్ను చూస్తేనే జనం మొహం చాటేసి పారిపోతున్నారంటే ఊళ్ళో ఎంత పరపతి మిగిలుందో అర్థం చేసుకోవచ్చు.

ఇంటాయన మంచివాడు కాబట్టి అద్దె ఇవ్వకపోయినా, గది ఇంకా ఖాళీ చేయించలేదు.

ఇంకొన్ని గంటలయితే ఈ గదిలోనే నిస్త్రాణతో స్పృహ తప్పటం, ఆ పై ప్రాణం పోవటం ఖాయం.

ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగా నా దృష్టి కిటికీ గట్టు మీద ఉన్న పొట్లంపై పడింది.

మైదా పిండి..!

నా సంస్థ తాలూకు పోస్టర్లు అంటించటానికి వాడే జిగురు తయారుచేయటం కోసం కొన్నప్పుడు మిగిలిపోయినది.

నూనె లేదు కానీ, అదృష్టవశాత్తూ స్టౌలో కాస్త కిరసనాయలు మిగిలి ఉంది.

దాని మీద పెనం పెట్టి, చపాతీ చెయ్యటం కోసం పిండిలో నీళ్ళు కలుపుతూ ఉండగా, పొట్లానికి కట్టిన న్యూస్ పేపరు మీద దృష్టి పడింది.

మూడు నెలల క్రితం పేపరు.

మెలో డ్రామా ఎక్కడో ఉండదు. మన జీవితాల్లోనే ఉంటుంది.

లేకపోతే పేపర్లో నాకు సంబంధించిన వార్త ఉండటమేమిటి?

ఆ క్షణమే అది నా కంట్లో పడటమేమిటి?

> గెలుపుకి ఓటమే మొదటిమెట్టు
>
> *కాకినాడ (రూరల్): ఓటమి పట్ల  నిరాశ చెందకూడదనీ, కష్టాల్ని ధైర్యంతో ఎదుర్కొంటూ కృషి చేస్తేనే విజయం లభిస్తుందని విద్యార్థులని ఉద్దేశిస్తూ 'మేధా' సంస్థల అధినేత చిరంజీవి ప్రసంగించారు. తాను ఒకప్పుడు...*

అంత వరకే ఉన్నది. నాకు బాగా నవ్వు వచ్చింది.  ఏడవటం కన్నా అది బెటరు కదా. –o0o–

# ప్రారంభం

వెంకటాపురం నుంచి కూనూరు వైపు వెళ్తున్న బస్సు అకస్మాత్తుగా ఆగిపోయింది. దారికి అడ్డంగా రాళ్ళున్నాయి. బస్సులో ఉన్నవాళ్ళందరూ భయంతో కిటికీల్లోంచి బయటకు చూశారు.

నా పక్కన కూర్చున్న వ్యక్తి "అన్నలా?" అని గొణిగాడు.

"అన్నలు గింత సిన్న సిన్న రాళ్ళెందుకు వెడతరు?" అన్నాడు పక్క వ్యక్తి.

"అయినా మన బస్సుకడ్డంగా అన్నలు రాళ్ళెందుకు పెడ్తరు? మనోళ్ళే గంద" అన్నాడు మరో ప్రయాణీకుడు.

వాళ్ళు మాట్లాడుకుంటున్నది మౌనంగా వింటున్నాను. అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ముందు వరుసలో మా రెడ్డీ, మరో ఇద్దరు స్నేహితులూ కూర్చుని ఉన్నారు. మేమందరం క్లాసుమేట్స్‌మి. వెంకటాపురంలో ఎక్కాము. మా స్కూలు ఉండేది కూనూరులో.

కండక్టర్ విసుక్కుంటూ దిగి రాళ్ళు అడ్డం తీసాడు. చిన్న రాళ్ళే కాబట్టి అయిదు నిముషాల్లో బస్సు కదిలింది. బస్సులో ఉన్నవాళ్ళకి ఆ రాళ్ళు ఎవరు పెట్టారో, అసలెందుకు పెట్టారో అర్థం కాలేదు.

ఆ మరుసటి రోజు మరింత పెద్ద బండరాళ్ళు రోడ్డుకి అడ్డంగా ఉన్నాయి. చిన్నవి పెడితే తీసేసారని ఈసారి పెద్దవి పెట్టారు. బస్సుని ఆలస్యం చేయటమే ఉద్దేశ్యం.

పక్కనున్న కొండగుట్ట మీద నుంచి క్రిందికి తోసినట్టూ తెలుస్తోంది. పైనుంచి రోడ్డు మీదకు 'తొయ్యటం' సులభం. కానీ రాయిని రోడ్డు మీద నుంచి 'తొలగించటం' కష్టం. కండక్టరూ డ్రైవరూ కలిసి తోసినా వాటిని పక్కకి తొలగించటం సాధ్యపడలేదు. బస్సులో ప్రయాణికులు ఒకరిద్దరు తప్ప ఇంకెవరూ వారికి సాయపడలేదు.

దానికి కారణం ఏమిటంటే, ఆ రాళ్ళు ఎవరు పెట్టారో, ఎందుకు పెట్టారో ముందు రోజు సాయంత్రానికే చాలామందికి తెలిసింది.

ఎలాగైతేనేం రాళ్ళు తొలగించారు. బస్సు కదలటానికి మూడు గంటలు పట్టింది. ఆ తరువాత కూనూరు వెళ్ళేవరకూ, ఆగిన ప్రతిచోటా... ఎక్కిన ప్రతివారూ బస్సు ఆలస్యమైనందుకు డ్రైవర్నీ, కండక్టర్ని తిట్టటమే.

ఆ రోజుల్లో ప్రభుత్వ ట్రాన్స్‌పోర్ట్ లేదు. ఒకటే బస్సు. దాని ఓనరు పేరు అశోక్.

వరంగల్ నుంచి ప్రొద్దున్నే బయల్దేరి ఊళ్ళన్నీ తిరుగుతూ, మా పల్లె వెంకటాపురం మీదుగా కూనూరు వరకూ నాలుగు ట్రిప్పులు వేసేది. దాన్ని 'దొరల బస్సు' అనేవారు. ఏ కారణం చేతయినా ఒక చోట ఆలస్యమైందంటే, పక్క ఊళ్ళలో జనమంతా అంత సేపూ ఎదురు చూడాల్సిందే. అందుకే, ఆగిన ప్రతి చోటా తిట్ల వర్షం కురిపించారు.

అంతే కాదు. మూడు గంటలు ఆలస్యమైందంటే, ఒక ట్రిప్పు పోయిందన్న మాటే. ఆ విధంగా చూస్తే, ఈ రాళ్ళ వ్యవహారం చిన్నది కాదు. మరో నాలుగు రోజులు ఇలాగే జరిగితే మరింత పెద్దది అవుతుంది. అందుకే పాపం కండక్టరు బిక్క మొహం వేసుకుని కూర్చున్నాడు.

వ్యవహారం తేల్చుకోవటానికి మరుసటి రోజు అశోక్ మా పల్లెకు వచ్చాడు.

. . .

"నలుగురు పోరగాళ్ళని ఇస్కూలుకి ఎక్కించుకుని పోయేదానికి నీ బండి అరిగిపోద్దా? తీస్కపోరాద్వయ్యా?" అన్నాడు మా గ్రామ పెద్ద.

అశోక్ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. గ్రామస్తులు ఎదురుగా ఉన్నారు. మేము నలుగురం దూరంగా నిలబడి చూస్తున్నాము.

"గిట్ల పిల్లల్నందర్నీ ఫ్రీగా ఎక్కించుకుని పోతే, నే బస్సు అమ్ముకుని ఎడ్లబండి కొనుక్కొని తిప్పాలె" అన్నాడు అశోక్.

మా ఇంటి పక్కన కిరాయికి ఉండే పటేలు సారు, "గవర్నమెంటు సర్వీసుంటే గసలీ గొడవే లేకపోతూండె" అన్నాడు.

అశోక్ ఆయన వైపు తిరిగి కాస్త కోపంగా “సర్కారు బస్సులో కూడా ఇస్కూలుకెల్లే పోరగాండ్రకి సగం రేటు టిక్కెట్టు తీసుకుంటారు" అన్నాడు.

ఊరి పెద్దాయన కల్పించుకుని, "సూడు అసోకా. ఎంకటాపురం నుంచి కూనూరెల్ళి పెద్ద సదువులు సదువేది గీల్లు నలుగురంటే నలుగురు. ప్రతి రోజూ మా వూరు మీద నుంచే నీ బస్సు పోవాల. గీ నలుగుర్ని ఎక్కించుకుంటే నీకొచ్చే నష్టం ఏంది చెప్పు?” అన్నాడు.

అశోక్ ఏదో చెప్పబోతూంటే ఆపుచేసి, “ఇంత సిన్న ఇషయాన్కి బస్సు అమ్ముకునేది ఏంది? ఎడ్లబండ్లు కొనుక్కునేది ఏంది? ఎందుకంత పరేషానయితవ్? బాగా సదువుకుని ఆల్లు పెరిగి పెద్దోల్లయితే, ఆ పున్నెమొచ్చేది నీకే గంద" అన్నాడు సర్ది చెపుతున్నట్టు.

పైకి సర్ది చెపుతున్నట్టే ఉందికానీ, ***'నీ బస్సు పోవాల్సింది మా ఊరి మీంచే కదా'*** అన్న చోటే అశోక్ ఆలోచన్లు ఆగిపోయాయని నాకు తెలుసు.

రెండు నిముషాలు ఆలోచించుకుని "సరే" అన్నాడు. ఊర్లో పిల్లలందరినీ ఉచితంగా తీసుకెళ్ళటానికి ఆ విధంగా ఒక మర్యాదస్తుల ఒడంబడిక జరిగింది.

మేము బయటకొచ్చి, గుట్ట మీద నుంచి రాళ్ళని తోస్తున్నప్పుడు బొబ్బలెక్కిన అరచేతుల్ని ఆనందంగా ముద్దెట్టుకున్నాం.

రాళ్ళని అడ్డుగా పెట్టాలన్న ఆలోచన నాదే.

పెద్దలకి తెలిస్తే తిడతారని మా మరో స్నేహితుడు భయపడ్డప్పుడు, ‘ఊరి పిల్లల్ని పెద్దోళ్ళు తిట్టరనీ, మమ్మల్నే సమర్థిస్తారనీ’ రెడ్డి అన్న మాటలు నిజమయ్యాయి.

మొత్తానికి అనుకున్నది సాధించాం.

ఈ విషయం మా స్కూల్లో కూడా తెలిసి అందరూ అభినందించారు. మాష్టారు మాత్రం, "మొత్తానికి భయపెట్టి సాధించార్రా. భవిష్యత్తులో నక్సలైట్లయ్యే లక్షణాలు కనపడుతున్నాయి" అన్నాడు.

నేను నక్సలైటు అవలేదు గానీ, నా తరువాతి భవిష్యత్తులో గొప్ప మార్పుకి ఒక నక్సలైటు కారణమయ్యాడు.

## 2

మా పూర్వీకులు దశాబ్దాల క్రితం మహారాష్ట్ర నుంచి తెలంగాణాకి వలస వచ్చారట. అందుకని మా పేర్ల పై మరాఠీ ప్రభావం ఎక్కువ ఉంటుంది. మగవారి పేర్లు శివాజీ, రాంజీ, సంతాజీ, నానాజీ, మల్లాజీ; ఆడవారి పేర్లు జిజియాబాయి, కమలాబాయి, రాధాబాయి, లక్ష్మీబాయి. ఈవిధంగా ‘బాయ్, జీ’ లతో ఎక్కువగా పూర్తవుతాయి.

మా వాళ్ళలో ‘చిరంజీ’ అన్న పేరు చాలా మందికి ఉండేది.

మా కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌కి వలస వచ్చాక, కాలక్రమేణా చివర్లో ‘వి’ తగిలించేవారు.

అదే నా పేరు.

చిరంజీ..వి!

నాకు ఇద్దరు అన్నయ్యలు, ముగ్గురు అక్కలు. నేను చివరివాడ్ని. నేను పుట్టిన రెండు సంవత్సరాలకి నాన్న పోయారు.

మాది కాజీపేట దగ్గర్లో జఫర్‌గడ్ మండలం వెంకటాపురం. ఆ రోజుల్లో ఐదొందల ఇళ్ళున్న ఊరు. వ్యవసాయాధారిత కుటుంబం. పేరుకి పదిహేను ఎకరాలు కానీ, రాబడి ఏమీ ఉండేది కాదు. మా ఆరుగురినీ అమ్మే పెంచి పెద్ద చేసింది.

మొదటి రెండు సంవత్సరాలు మా ఊర్లోనే చదివాను.

ఆ పైన అమ్మ నన్నూ, చిన్నన్నయ్యనీ కరీంనగర్ జిల్లా చింతల్‌పల్లి గ్రామంలో అమ్మమ్మ దగ్గర పెట్టింది. అమ్మమ్మ కొడుకు, అంటే మా మావయ్య చింతల్‌పల్లి ఊర్లోని స్కూల్‌ని నడిపించే వాడు. ఆయన పేరు రాజయ్య. 'రాజయ్య సార్' అంటే ఆ ఊర్లో చాలా మంచి పేరుండేది.

చదువులో నేను బాగా ఉండేవాడ్ని. నాలుగో తరగతి చదివే అన్నయ్య పుస్తకాలన్నీ మూడో తరగతిలోనే చదివేసాను. "...సంవత్సరం పాటూ మూడో తరగతి ఎందుకు చదవాలి? నాలుగో తరగతిలోకి పంపించవచ్చు కదా" అని గొడవ చేసేవాడిని.

నా ఏడుపు భరించలేక ఆ తరువాతి సంవత్సరం మా ఇద్దరినీ ఐదో తరగతిలో వేయటానికి నిశ్చయించారు.

కానీ మా మావయ్య స్కూల్లో నాలుగో తరగతి వరకే ఉండేది. అందుకు మమ్మల్నిద్దర్నీ 'దామర' అనే ఊర్లో అయిదో తరగతిలో వేశారు.

మా అన్నయ్యకి చదువంటే అంత ఉత్సాహం ఉండేది కాదు. అల్లరి చిల్లరగా తిరిగేవాడు. తోటల్లో పళ్ళు దొంగతనం, స్నేహితులతో తిరగటం, గొడవలు పెట్టుకోవటం వంటివి చేసేవాడు. అయిదో తరగతితో చదువు మానేసాడు.

ఆ పై వాడేం చేసాడో, ఏమయ్యాడో తరువాత చెప్తాను.

ఎప్పుడైతే అన్నయ్య చదువు మానేసాడో, రాజయ్య సార్ మామయ్య దగ్గర ఒక్కణ్ణే ఉండలేకపోయాను. అప్పుడు వరంగల్ జిల్లా 'రేకనపల్లి' లో రెండో అక్కయ్య దగ్గరకి పంపించారు. నా స్కూలు నాచనపల్లిలో ఉండేది. రెండు ఊళ్ళ మధ్యా బస్సులు లేవు.

ప్రతిరోజూ రేకనపల్లి నుండి నాచనపల్లి ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళేవాడిని.

తొమ్మిదేళ్ళు నిండకుండానే మూడు స్కూళ్ళు మారటం వల్ల రకరకాల స్నేహితులతో కలిసే అవకాశం దొరికింది.

తెలియని వాళ్ళతో కూడా తొందరగా కలిసిపోవటమన్న కళ బహుశా అప్పుడే అలవడిందనుకుంటాను. తరువాతి జీవన గమనంలో ఇది చాలా ఉపయోగపడింది.

మా బావ క్రమశిక్షణకి మారు పేరు. ఒక రకంగా ఆయనే నాకు స్ఫూర్తి కూడా. మా బావ అంటే నాకెంత భయమంటే, ఆయన ముందు ఎప్పుడూ మంచం మీద కూర్చోవటం గానీ, పడుకోవటం గానీ చేసేవాడ్ని కాదు.

ప్రతీ పనినీ క్రమశిక్షణతో చేయటం నేను ఆయన దగ్గర్నుంచే నేర్చుకున్నాను.

ఉదయం ఆరు గంటలకి పశువులకి గడ్డి వేసి, అప్పుడు తయారయి స్కూల్‌కి వెళ్ళేవాడిని. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చాక బట్టలు ఉతకటం దగ్గర్నుంచీ అన్ని పనుల్లోనూ అక్కకి సాయం చేసేవాడిని.

ఆయన దగ్గర నేను నేర్చుకున్న మరో విషయం సైకిల్ అద్దంలా శుభ్రంగా తుడవటం..! ఆయన అరగంట తుడిచేవాడు. నేను కుర్రవాడిని కాబట్టి పది నిముషాల్లో తుడిచేవాడిని. ఆయిలు ఎక్కడ ఎంత వెయ్యాలో, గ్రీసు ఎంత పెట్టాలో కూడా ఒక కళ. దానికి ఎంతగా పేరొచ్చిందంటే, చుట్టుపక్కల ఊరినుంచి చుట్టాలెవరైనా మా ఊరికి వస్తే వారి సైకిల్ తుడిచి, గ్రీసు పెట్టే బాధ్యత నాకు అప్పగించబడేది.

మా ఊర్లో ఒకటే సైకిల్ షాప్ ఉండేది. గాలి 'ఫ్రీ' కాబట్టి ఆ షాప్‌లో గాలి కొట్టే పంపు ఎల్లప్పుడూ పాడయ్యే ఉండేది. ఊరి మొత్తం మీద రెండో పంపు మా ఇంట్లో మాత్రమే ఉండటంతో, గాలి కొట్టించుకోవటానికి వచ్చేవారందరూ (వీలైతే సైకిల్ కూడా తుడిపించుకుని) నన్ను మెచ్చుకుంటూ ఉండేవారు. మెచ్చుకోలు తప్ప డబ్బులు ఏమీ ఇచ్చేవారు కాదు.

పొగడ్తలకి పడిపోతే, ప్రతీవాడూ దాన్ని ఆయుధంగా వాడుకోవటానికి ప్రయత్నిస్తాడని తెలుసుకోవటానికి రెండు నెలలు పట్టింది.

కానీ ఆ వాస్తవం నాకు జీవితాంతం ఉపయోగపడింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)